## క్లుప్తంగా

### బదిలీ ఉద్యోగులకు సన్మానం



బదిలీ అయిన సచివాలయ సిబ్బందిని సన్మానిస్తున్న నేతలు

**జామి:** మండలంలోని అలమండ గ్రామంలో పని చేస్తున్న సచివాలయ సిబ్బంది ఇటీవల బదిలీ కాగా వారిని సచివాలయంలో తోటి సిబ్బంది మంగళవారం సన్మానించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు, సర్పంచ్ కోట పాపమ్మ, ఉప సర్పంచ్ లగుడు దేముడు తదితరులు పాల్గొన్నారు.

### నేత్ర వైద్య శిబిరానికి స్పందన



నేత్ర పరీక్షలు చేస్తున్న శంకర్ ఫౌండేషన్ వైద్యులు

**దత్తిరాజేరు:** మండలంలోని ఆర్ రామచంద్రాపురం ఉన్నత పాఠశాలలో అమ్మ సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు దేవారపు సురేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన నేత్ర శిబిరానికి మంచి స్పందన లభించింది, వైజాగ్ శంకర్ ఫౌండేషన్ వైద్యులు ఎంఎల్ఎస్ మూర్తి 68 మందికి నేత్ర పరీక్షలు చేయగా 38 మందికి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. క్యాంప్ మేనేజర్ వెంకటరమణ, పాఠశాల ఉపాధ్యాయులు చంద్రరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బేత రవి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న పీవో

**చీపురుపల్లి రూరల్ (గరివిడి):** గరివిడి మండలంలోని కాపుశంభం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు అధికారి విమలారాణి ఆకస్మికంగా తనిఖీ జరిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎంత మంది చిన్నారులు ఉన్నారు, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ప్రీ స్కూల్ కార్యక్రమాలను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, మూడు సంవత్సరాల లోపు గల పిల్లలకు రేషన్ అందజేస్తున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. రేషన్ సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. యాప్‌లో ఏమైనా టెక్నికల్ సమస్యలు ఉత్పన్నమైతే వాటిని సవరించి ఫేసు క్యాప్చర్ ద్వారా టేక్‌హోమ్ రేషన్ అందివ్వాలని సూచించారు. సీడీపీవో ఎస్.ఆరుద్ర, సూపర్‌వైజర్ జ్యోతి పాల్గొన్నారు.

### ఆక్రమణలు తొలగించండి

**శృంగవరపుకోట :** ఎస్.కోటలోని మెయిన్‌రోడ్డు పరిశీలనకు మంగళవారం వచ్చిన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి స్థానికులు ఆక్రమణలపై మొర పెట్టుకున్నారు. ప్రధాన రహదారిలో పేరుకున్న మురుగు సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యేతో పాటు తహసీల్దార్, ఎంపీడీవో, ఆర్‌అండ్‌బీ, పీఆర్ జేఈలు, పంచాయతీ ఈవో తదితర ఉద్యోగులతో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా స్థానికులు ఆక్రమణలే ప్రధాన సమస్య అన, దుకణాల పేరుతో రోడ్లను ఆక్రమిస్తున్నారని, ఇది ఇబ్బందిగా మారిందని తెలిపారు. అధికారుల వివరణ అనంతరం ఆమె మాట్లాడుతూ ఆక్రమణలు తొలగించాలి, ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. తాత్కాలికంగా వర్షపు నీరు పోయేందుకు మార్గం చూడాలని ఆదేశించారు. ఆక్రమణల తొలగింపునకు మిషనరీ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఆక్రమణలకు అనుమతులు, విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నారని ఆర్‌అండ్‌బీ జేఈ సురేష్ తెలిపారు. అందరికీ నోటీసులు పంపి తొలగిస్తామి తహసీల్దార్ శ్రీనివాసరావు చెప్పారు.

### రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు

**వేపాడ:** మండలంలోని ఆతవ నుంచి భూమిరెడ్డి పాలెం వెళ్లే రహదారి నిర్మాణానికి రెండు కోట్ల నలభై లక్షల రూపాయిలతో ప్రతిపాదనలు చేసిన నివేదికను ఎంపీడీవోకు పంచాయతీరాజ్ ఏఈ మహమ్మద్ ఆలీ అందజేశారు. ప్రజాసమస్యల పరిష్కారంలో సామాజిక కార్యకర్త అప్పారావు ఇచ్చిన వినతి మేరకు ప్రతిపాదనలు చేయాలని డ్వామా పీడీ ఆదేశించటంతో పీఆర్ జేఈ ఆలీ రూ.2.40 కోట్లతో ప్రతిపాదనలు చేసి ఎంపీడీవో సూర్యనారాయణకు అందజేశారు. దీని ఆమోదానికి కలెక్టర్ కార్యాలయానికి పంపనున్నట్టు ఎంపీఈఓ తెలిపారు.

### ఆశ్రమ పాఠశాలకు రెడ్‌క్రాస్ వితరణ

**శృంగవరపుకోట :** పట్టణంలో గిరిజన సంక్షేమ శాఖ నిర్వహిస్తున్న స్థానిక ఆశ్రమ ఉన్నత పాఠశాలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎస్.కోట డిస్ట్రిక్ట్ బ్రాంచి సభ్యులు సీలింగ్ ఫ్యాన్లు, బోర్డులు, మస్కిటో నెట్‌లను తమ ఆర్థిక సాయంతో మంగళవారం ఏర్పాటు చేశారు. ఎస్.కోట వచ్చిన ఎమ్మెల్యే లలితకుమారితో కలిసి వాటిని రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పాఠశాల హెచ్.ఎంకు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డా.పి.వరలక్ష్మి, ఎం.సి మెంబర్ డి.సూర్యారావు, కోశాధికారి శ్రీనాధు వెంకన్న, వైస్‌చైర్మన్ ఎ.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

# బాబు పాలన అంతా మోసం



గుర్ల: బాబు మోసాలపై వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

**గుర్ల:** కూటమి ప్రభుత్వం మహిళలకు తీవ్ర అన్యాయం చేసిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు అన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని సొలిపిసోమరాజుపేటలో మంగళవారం ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన మోసాలు గురించి వివరించారు. ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చి ఆ పథకం అమలు చేయడం కుదరదని కూటమి మంత్రులు చెబుతున్నారని మహిళలకు తెలియజేశారు. వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, ఎంపీటీసీ రాజారావు, వైస్ సర్పంచ్ గుంటమాని గోవింద్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

#### బాబు మోసాలపై ఇంటింట ప్రచారం

**జామి:** చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాలపై మండలంలో కుమరాం, అట్టాడ గ్రామాల్లో మండల వైఎస్సార్‌సీపీ నేతలు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు .కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎవరు ఎంత నష్టపోయారో వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ గొర్లె సరయు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు అల్లు అవినాష్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ఫణిబాబు, నేతలు చలుమూరి సత్యారావు, అప్పాన సుబ్రమణ్యం, ఎస్. చందునాయుడు, కిలారి సూర్యారావు, పిన్నింటి రవికుమార్, స్థానిక సర్పంచ్ పిన్నింటి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ కంది పద్మావతి, వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు, పి.నరసింహనాయుడు, వాసు, గేదెల రమణబాబు, ఎస్.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



జామి: కుమరాంలో చంద్రబాబు మోసపూరిత పాలనపై వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

#### నయవంచన

**గంట్యాడ:** ప్రజలను మోసం చేయడంలో సీఎం చంద్రబాబు సిద్ధహస్తుడని జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్ ఆరోపించారు. మండలంలోని జగ్గాపురం, నందాం గ్రామాల్లో మంగళవారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జాగరపు అప్పారావు, ఉపాధ్యక్షుడు వర్రి మల్లయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి జాగరపు సత్యారావు, నియోజకవర్గం సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఈదుబిల్లి రమేష్‌కుమార్, మండల యువజన విభాగం అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు వెంకటరావు, నందాం సర్పంచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గంట్యాడ: బాబు మోసాలను వివరిస్తున్న పార్టీ శ్రేణులు

#### వంచన చేసేందుకే కూటమి

**గజపతినగరం రూరల్:** కూటమికి ఓట్లు వేసి గెలిపిస్తే సంక్షేమం రాష్ట్రంలో ప్రతీ ఇంటా ఉంటుందని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఏపీ ప్రజలను మోసం చేశారంటూ జెడ్పీటీసీ గార తవుడు అన్నారు. మండలంలోని ముచ్చర్ల, లింగాలవలస గ్రామాలలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటించి ప్రజలకు కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, మండల యువజన నాయకులు కె.పైడపునాయుడు, కనకల సుబ్రహ్మణ్యంతో పాటు పలువురు పాల్గొన్నారు.



గజపతినగరం రూరల్: ముచ్చర్ల గ్రామంలో కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

# కార్మికుల ఉపాధిని కాపాడాలి

**చీపురుపల్లి రూరల్ (గరివిడి):** మైన్స్ లీజును పునరుద్ధరించి కార్మికుల ఉపాధిని కాపాడాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గరివిడి మండలంలోని దేవాడ, గుర్ల మండలంలోని సదానందపురంలో గల రెండు మైన్స్‌లో సుమారు 500 మంది కార్మికులు పని చేస్తున్నారు. ఈ రెండు మైన్సు లీజు గడువు ముగుస్తుండటంతో కార్మికులను తొలగించటానికి సంబంధిత ఆర్ ఎం అండ్ ఆర్‌బీఎస్ డీఎఫ్ఎస్ దాస్ కంపెనీ ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చిందని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్మికులందరూ ఏళ్ల నుంచి ఈ కంపెనీలో పని చేస్తున్నారని, కార్మికుల పొట్ట కొట్టకుండా చూడాలని, మైన్సు లీజును పునరుద్ధరించాలని, కార్మికులకు ఉపాధిని కల్పించాలనే అంశాలతో ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.గౌరినాయుడు, మైన్స్ నాయకులు పిసిని అప్పలనాయుడు, రమణ, సాంబ, ఫేకర్ నాయకులు ప్రకాష్, ముఖేష్, కంది రామారావు, పెన్షనర్ సంఘ నాయకులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**శృంగవరపుకోట:** పట్టణంలోని పుణ్యగిరి ఫీడర్ పరిధిలో 11కేవీ లైన్‌లో మరమ్మతు పనుల దృష్ట్యా విద్యుత్ సరఫరాను బుధవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ నిలిపేస్తున్నట్టు ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. దీనివల్ల తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి, బర్మా కాలనీ, వై.ఎస్.ఆర్.కాలనీ, రేగపుణ్యగిరి, అయ్యప్ప లేఅవుట్, పుణ్యగిరి రోడ్డు పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ



ప్రకృతి వ్యవసాయంపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్న రీజనల్ టెక్నికల్ అధికారి

**వేపాడ:** మండలంలోని రామస్వామిపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బందికి క్షేత్ర స్థాయిలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో రీజనల్ టెక్నికల్ అధికారి హేమసుందర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఉద్దేశం, లక్ష్యాలు, ప్రకృతి వ్యవసాయం తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో కొత్తవలస సబ్ డివిజన్ సహాయ అధికారిణి బి.భానులత, వేపాడ, ఎస్.కోట, కొత్తవలస, జామి, లక్కవరపుకోటకు చెందిన వ్యవసాయాధికారులు, సుస్థిర వ్యవసాయ కేంద్రం కోఆర్డినేటర్ వెంకటరావు, వీఏఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

### బదిలీ ఉద్యోగులకు సత్కారం

**గుర్ల:** మండలంలోని చింతపల్లిపేట సచివాలయంలో ఆరుగురు ఉద్యోగులు ఇటీవల బదిలీ అయ్యారు. వారికి సర్పంచ్ జమ్ము శ్రీదేవి, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు జమ్ము అప్పలనాయుడు , అంబల్ల చిన్నారావు సచివాలయం వద్ద మంగళవారం దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. సచివాలయ పరిధిలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమస్యల పరిష్కారానికి చొరవ చూపారని వారి సేవలను కొనియాడారు. పంచాయతీ కార్యదర్శి పి.రాజ్యలక్ష్మి, స్థానిక నేతలు లెంక ఈశ్వరమ్మ, లెంక సూర్యనారాయణ, పత్తిగుళ్ల చిన్నప్పలనాయుడు, సత్తారు రమణ, సత్తారు రామ్మూర్తి ఉన్నారు.

# మౌలిక వసతుల కల్పనకు చర్యలు



మరుగుదొడ్లు నిర్మాణానికి శంకుస్థాపన పూజలు చేస్తున్న ఎంపీపీ వెంకటనర్సమ్మ

**చీపురుపల్లి:** మండల పరిషత్ నిధులతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ చెప్పారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రూ.లక్ష మండల పరిషత్ నిధులతో నిర్మించనున్న మరుగుదొడ్ల నిర్మాణానికి మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలుర ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల సమస్య ఉందని ఉపాధ్యాయులు తమ దృష్టికి తీసుకురావడంతో మండల పరిషత్ నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. పాఠశాలల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, పాఠశాల కమిటీ చైర్మన్ గవిడి సురేష్, పార్టీ నాయకులు ముల్లు పైడిరాజు, కోరుకొండ దాలయ్య, కొమ్ము చిరంజీవి, మల్లెంపూడి శ్రీను, కర్రోతు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సాగుపై అవగాహన



గజపతినగరం: లింగాలవలసలో రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏడీఏ, ఏవో

**గజపతినగరం :** సకాలంలో వర్షాలు కురవకపోవడంతో నీటి ఎద్దడి వల్ల ఇబ్బందులు పడుతున్న రైతులు ఆ స్థానంలో మినప, పెసర, మొక్కజొన్న పంటలు వేసుకోవాలని స్థానిక వ్యవసాయ శాఖ ఏడీఏ నిర్మలా జ్యోతి సూచించారు. మండలం లింగాలవలస, కొత్తబగ్గాం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మంగళవారం పాల్గొని రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. గట్లపై వేసేందుకు కందుల ప్యాకెట్లను రైతులకు పంపిణీ చేశారు. ఏవో పి.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

#### యాజమాన్యంపై జాగ్రత్తలు తప్పనిసరి

**జామి:** నారుమడులు యాజమాన్యంపై రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం కోఆర్డినేటర్ బి.భారతి తెలిపారు. అలమండ, జామి గ్రామాల్లో ప్రధానమంత్రి ఆర్‌కేవై కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె నారుమడి యాజమాన్యం, వరి పంటలో సమగ్ర సస్యరక్షణ వివరించారు. ఏవోలు ఎం.పూర్ణిమ, పి.నిర్మల, ఉద్యానవన శాఖ అధికారిణి పి.స్వాతి, ఏఈవోలు గీత, లావణ్య, వైస్ ఎంపీపీ గేదెల వెంటకరావు, సర్పంచ్ కోట పాపమ్మ, వైస్ సర్పంచ్ లగుడు దేముడు, పలువురు రైతులు పాల్గొన్నారు.



జామి: అలమండలో వరి యాజమాన్య పద్ధతులపై అవగాహన

#### కొత్తవలసలో..

**కొత్తవలస :** వరి నారుమడుల యాజమాన్యంలో భాగంగా నారుమడులో పరుగులు, తెగుళ్ల నివారణ సస్యరక్షణ చర్యలపై కంటకాపల్లి, కాటికాపల్లి గ్రామాల్లో రైతులకు ఏవో రాంప్రసాద్ మంగళవారం అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వరి ఉభాలను పరిశీలించారు. దెందేరు పశువైద్యాధికారి ఎ.అరుణ్‌కిరణ్, ఉద్యానవన శాఖ సహాయకులు రవిప్రకాష్, ఆర్.కె.నాయుడు పాల్గొన్నారు.

### నేడు మండల సమావేశం

**గుర్ల:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వీటీ వరప్రసాద్ మంగళవారం తెలిపారు. సమావేశానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరవుతారని తెలిపారు. సభ్యులు హాజరు కావాలని కోరారు. అధికారులు పూర్తి సమాచారంతో రావాలని ఆదేశించారు.

### టీడీపీలో బయటపడ్డ తమ్ముళ్ల వర్గ పోరు

**మెరకముడిదాం:** ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు సమక్షంలోనే మండలంలోని తెలుగు తమ్ముళ్ల వర్గ పోరు బయటపడింది. మెరకముడిదాం, ఊటపల్లి ప్రధాన రహదారి నుంచి ఎం.పాలెం గ్రామ సమీపంలో వున్న మెరకతల్లి అమ్మవారి ఆలయం వరకూ రూ.కోటి 60 లక్షల నిధులతో నిర్మించిన బి.టి. రహదారిని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడికళావెంకటరావు మంగళవారం ప్రారంభించారు. ఈ క్రమంలో గ్రామంలో ఒక వర్గానికి చెందిన టీడీపీ నాయకుడు తన ఇంటికి ఎమ్మెల్యేను తీసుకువెళ్లడంతో వ్యతిరేక వర్గం అలిగి కార్యక్రమం నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తన పీఏతో వెళ్లిపోయిన వారితో మాట్లాడి బుజ్జగించి హాజరు కావాలని కోరారు. దీంతో వారు మళ్లీ వచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు రహదారి ప్రారంభోత్సవంలో పీఆర్ ఏఈ హరికృష్ణ, ఎంపీడీవో గొర్లె భాస్కరరావు పాల్గొన్నారు.

### అలంకరణ



**ఆ**షాఢ మాసం చివరి మంగళవారం కావడంతో పట్టణంలో దారగంగమ్మ అమ్మవారిని కూరగాయలతో శాకాంబరిగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– శృంగవరపుకోట.

### నారు మడికి తడి



**ద**త్తిరాజేరు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వర్షాభావం ఏర్పడడంతో నారు మడులు ఎండిపోతున్నాయి. వీటిని కాపాడేందుకు రైతులు ట్యాంకర్ల ద్వారా నీరు మడుల వద్ద తీసుకొచ్చి తడులు అందిస్తున్నారు. కోమటిపల్లి, దత్తి, దత్తిరాజేరు, వంగర, వింధ్యవాసి, పెదమానాపురం, కృష్ణాపురం తదితర గ్రామాల్లో నారు మడులను బిందెలతో నీరు తీసుకొచ్చి అష్టకష్టాలు పడుతూ నారును బతికించే ప్రయత్నం చేస్తున్నారు.

– దత్తిరాజేరు

### నెల రోజులకే..



కూటమి ప్రభుత్వం పంపిణీ చేసిన బ్యాగు చిరిగిపోవడంతో కుట్టించిన బ్యాగు



బ్యాగులు చిరిగిపోవడంతో వేర్వేరు బ్యాగులతో వెళ్తున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

**ప్ర**భుత్వ పాఠశాలల విద్యార్థులకు నెల రోజుల కిందట పంపిణీ చేసిన బ్యాగులు అప్పుడే చిరిగిపోయాయి. నాణ్యతలో డొల్లతనం కనపడింది. దీంతో కొందరు విద్యార్థులు ఆ బ్యాగులనే కుట్టించుకోగా.. మరికొందరు వీటితో అయ్యే పని కాదని కొత్త బ్యాగులు బయట కొనుక్కుంటున్నారు. దీంతో ప్రభుత్వం పంపిణీ చేసిన బ్యాగుల్లో నాణ్యత తేటతెల్లమైంది.

– గజపతినగరం రూరల్

# స్మార్ట్‌మీటర్లను అడ్డుకోండి..

**శృంగవరపుకోట:** సంపద సృష్టి అంటే ప్రజల్ని దోచుకు తినేయటమేనా..నాడు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించిన చంద్రబాబు, లోకేష్‌లు నేడు స్మార్ట్‌మీటర్లను ఎలా బిగిస్తున్నారంటూ సీపీఐ, కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. మంగళవారం స్థానిక సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సీపీఐ నేత పి.కామేశ్వరరావు మాట్లాడుతూ నాడు చంద్రబాబు హయాంలో విద్యుత్ పోరాటం బషీర్‌బాగ్ వరకూ వెళ్లిందని, నేడు స్మార్ట్‌మీటర్ల వ్యవహారంలో ప్రభుత్వం వెనక్కి వెళ్లకపోతే మళ్లీ అదే పునరావృతం అవుతుందన్నారు. మీటర్ల బిగింపుకు వచ్చిన వాళ్లని తరిమేయాలని, మీటర్లకు డబ్బులు ఇవ్వొద్దని, అనుమతించొద్దని ప్రజలను కోరారు. ఇప్పటికే ఐదుసార్లు కరెంటు చార్జీలు పెంచారన్నారు. డి.సి.సి.బి ఉపాధ్యక్షులు గడి బంగారునాయుడు మాట్లాడుతూ ఎన్నికల వేళ అడ్డగోలు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను దోచేయటమే లక్ష్యంగా కూటమి సర్కారు నడుస్తోందన్నారు. పెరిగిన విద్యుత్ చార్జీలే గుదిబండ కాగా, ఇప్పుడు స్మార్ట్ మీటర్లు అంటూ సామాన్యుల నెత్తిన పిడుగు వేసేందుకు ప్రభుత్వం సిద్ధం కావటం సిగ్గుమాలిన చర్య అన్నారు.ఆయా పార్టీల నేతలు ఖండిపల్లి భీముడు, హనుమాలశెట్టి నానాజీ , ఎస్టీ సెల్ చైర్మన్ సీమల అచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# జక్కంపూడి అరెస్టు అన్యాయం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు అల్లు అవినాష్

**జామి:** ఆంధ్రా పేపర్ మిల్లు కార్మికులకు న్యాయం చేయాలని కార్మికుల తరపున ప్రజాసామ్య పద్ధతిలో పోరాటం చేస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజాను అరెస్ట్ చేయడం అన్యాయమని ఆ పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు అల్లు అవినాష్ ఖండించారు. జామిలో రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి కెవిజిపిబి.ఫణిబాబుతో కలిసి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అర్ధరాత్రి 150 మంది పోలీసులతో జక్కంపూడి రాజాను హౌస్ అరెస్ట్ చేశారని మండిపడ్డారు. అతనితో పాటు మరొక 50 మందిని ప్రివెంటివ్ అరెస్ట్ చేసి పోలీస్‌స్టేసన్‌కి తరలించడం దారుణమని అన్నారు. కార్మికులకు న్యాయం కోసం మంగళవారం తెల్లవారుజామున అమరణ నిరాహార దీక్షకు సిద్ధమవుతున్న తరుణంలో అర్ధరాత్రి హౌస్ అరెస్టులు చేయడం హేయమని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజల సంక్షేమాన్ని మరచి వైఎస్సార్‌సీపీ నేతలను అరెస్టులు చేయడమే పనిగా పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. జక్కంపూడిని తక్షణమే విడుదల చేయకపోతే పోరాటం తప్పదని హెచ్చరించారు. చుక్క ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

#### హక్కుల కోసం పోరాడితే అరెస్టులా..

**శృంగవరపుకోట:** పేపర్ మిల్ కార్మికుల కోసం ఆమరణ దీక్షకు సిద్ధమైన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజనే విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా అరెస్టు ఆటవిక చర్య అని మండల యువజన విభాగం అధ్యక్షులు వాకాడ సతీష్ అన్నారు. మంగళవారం సతీష్ మాట్లాడుతూ కొన్ని రోజులుగా రాజమండ్రి పేపర్ మిల్లు కార్మికుల సంక్షేమం కోసం ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా, ఇప్పుడు రాజా ఆమరణ దీక్షకు పిలుపు ఇవ్వగానే తెల్లవారుజామున హౌస్ అరెస్టు చేయటం ప్రభుత్వ సిగ్గుమాలిన చేష్టలకు పరాకాష్ట అన్నారు.